# జోరుగా ఇండ్ల విక్రయాలు

- హైదరాబాద్‌లో.. నెలవారి ఇండ్ల విక్రయాల్లో మెరుగైన వృద్ధి
- నవంబర్‌లో రూ.3741 కోట్ల విలువ చేసే స్థిరాస్తుల విక్రయం
- గతేడాదికంటే 12 శాతం అధికం
- నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదికలో వెల్లడి



సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరంలో 2023 సంవత్సరంలో నెలవారి ఇండ్ల విక్రయాలు గతేడాదితో పోల్చుకుంటే మెరుగైన వృద్ధి రేటు నమోదైందని నైట్ ఫ్రాంక్ ఇండియా శుక్రవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. 2022లో జనవరి నుంచి నవంబర్ నాటికి మొత్తం 11నెలల్లో అంతకు ముందు ఏడాదితో పోల్చితే (-9 శాతం)లోటు వృద్ధి రేటు నమోదు కాగా, 2023 జనవరి నుంచి నవంబర్ నాటికి 11నెలల్లో నమోదైన వృద్ధి రేటు 2022 ఏడాది కంటే 12శాతంగా అధికంగా ఉన్నదని వెల్లడించింది. ఈ ఏడాది (2023) నవంబర్ నెలలో మొత్తం 6268 రెసిడెన్షియల్ ప్రాపర్టీస్ రిజిస్ట్రేషన్ కాగా, వాటి మొత్తం రిజిస్ట్రేషన్ విలువ రూ.3741 కోట్లుగా ఉన్నదని నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదికలో వివరించింది. ఇందులో రూ.25లక్షల నుంచి 50 లక్షల విలువ చేసే ఆస్తులు 48శాతం ఉండగా, రూ.50 -75 లక్షల విలువ చేసే ఆస్తుల విలువ 17శాతం, రూ.75 లక్షల నుంచి రూ.1కోటి విలువ చేసే ఆస్తులు 9 శాతం, రూ.కోటి నుంచి 2 కోట్ల విలువ చేసే ఆస్తుల విలువ 10 శాతం, రూ.2 కోట్ల కంటే ఎక్కువ విలువ చేసే ఆస్తులు 3 శాతంగా 2023లో నమోదైందని పేర్కొన్నారు.

**రిజిస్ట్రేషన్ అయిన ఆస్తుల విలువ (జనవరి-నవంబర్)**

| సంవత్సరం | రిజిస్ట్రేషన్ల విలువ | వృద్ధి రేటు |
|---|---|---|
| 2021 | 33,531 | - |
| 2022 | 30,429 | - 9శాతం(లోటు) |
| 2023 | 34,205 | 12శాతం |

**రిజిస్ట్రేషన్లు జరిగిన యూనిట్లు (జనవరి-నవంబర్)**

| సంవత్సరం | రిజిస్ట్రేషన్లు | వృద్ధి రేటు |
|---|---|---|
| 2021 | 75,452 | - |
| 2022 | 62,208 | -18 శాతం (లోటు) |
| 2023 | 64,658 | 4 శాతం |

**జిల్లాల వారీగా రిజిస్ట్రేషన్లు (శాతం)**

| జిల్లాలు | 2022 | 2023 |
|---|---|---|
| హైదరాబాద్ | 14 | 14 |
| మేడ్చల్ | 40 | 43 |
| రంగారెడ్డి | 39 | 43 |

## హమాలీ రేట్లు పెంచాలని మంత్రికి వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేసిన కార్మికులు

చాదర్‌ఘాట్, డిసెంబర్ 15 : టీఎస్ఆర్టీసీ కార్గో పార్సల్ హమాలీ చార్జీలను పెంచాలని కోరుతూ లైసెన్స్డ్ పోర్టర్స్ యూనియన్ నేతలు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ సి4ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ లైసెన్స్డ్ పోర్టర్స్ యూనియన్ అధ్యక్షుడు కారింగల మారుతీ, యూనియన్ నేతలు ఉన్నారు.

## ఫార్మాసిటీని రద్దుచేస్తే.. ఆ భూములను రైతులకు ఇవ్వాలి

- మెజార్టీ రైతుల అభిప్రాయం మేరకే.. కేసీఆర్ ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటు
- కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- రియల్ ఎస్టేట్ సంస్థలకు కట్టబెడితే సహించేది లేదు
- జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ సురుసాని



కందుకూరులో మాట్లాతున్న జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి. సురేందర్‌రెడ్డి. జయేందర్ ముదిరాజ్

కందుకూరు, డిసెంబర్ 15: ఫార్మాసిటీని రద్దుచేస్తే ఆ భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్‌లతో కలిసి మాట్లాడారు. అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ భూములు కోల్పోయిన రైతులకు ఆ భూములను తిరిగి ఇప్పిస్తామని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఆ హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. ఫార్మాసిటీ భూములను రియల్ ఎస్టేట్ సంస్థలకు కట్టబెట్టి వ్యాపారం చేయాలని చూస్తున్నదని ఆరోపించారు. ఈ ప్రాంత అభివృద్ధితో పాటు ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం పొల్యూషన్ రహిత ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తామంటే మెజార్టీ రైతులు ఒప్పుకొని భూములు ఇచ్చారని, ప్రజల అభిప్రాయం మేరకే ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం ముందుకు వచ్చినట్లు గుర్తుచేశారు. ఇదేవిషయమై మాజీ మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని, భూములు రైతులకు ఇవ్వని పక్షంలో రైతుల పక్షాన ఉంటూ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్థం లేకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు బొక్క దీక్షిత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నేడు గిరిజన ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సత్కారం

### హాజరుకానున్న సీఎం, డిప్యూటీ సీఎం

సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన నూతన గిరిజన ప్రజాప్రతినిధులకు గిరిజన ఉద్యోగ, ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం చేయనున్నట్లు నిర్వహణ కమిటీ తెలిపింది. ఈనెల 16న (నేడు) రవీంద్రభారతిలో ఉదయం 10గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు బట్టివిక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, ఖానాపూర్ ఎమ్మెల్యే ఎడ్మ బొజ్జు, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, దేవరకొండ ఎమ్మెల్యే నెనావత్ బాలునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళినాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జానె ఆదినారాయణ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును సన్మానిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ వెల్లడించింది.

## బీసీల గొంతుకగా ఉంటా : మంత్రి పొన్నం



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సత్కరిస్తున్న గౌడ సంఘాల నేతలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 15 : బడుగు, బలహీన వర్గాల గొంతుకగా ఎప్పటికీ ఉంటానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. తెలంగాణ గౌడ సంఘం, పీసీసీ కల్లుగీత సెల్ డిపార్ట్‌మెంట్ సంయుక్తాధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను సత్కరించారు. గౌడ సంఘం అధ్యక్షుడు కేశం నాగరాజు గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మక్తల్ ఎమ్మెల్యే వాకటి శ్రీహరి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్, మాజీ ఎమ్మెల్యే రాజలింగం, గౌడ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు శంబుల శ్రీకాంత్‌గౌడ్, గౌడ సంఘం కోశాధికారి పి.హరిచరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా ధర్నాలు చేయొచ్చు

### నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి



ధర్నాచౌక్‌ను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్ రెడ్డి

కవాడిగూడ, డిసెంబర్ 15 : ప్రజా స్వామ్యంలో తమ నిరసనలు తెలియజేసుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నదని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శాంతియుతంగా ధర్నాలు చేస్తే తమకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, ధర్నాలు చేసే వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. శుక్రవారం ఆయన నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సెంట్రల్ జోన్ డీసీపీ శ్రీనివాస్, చిక్కడపల్లి, గాంధీనగర్ ఏసీపీలు మధుమోహన్ రెడ్డి, కందుల రవికుమార్, దోమలగూడ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, డీఐ వరప్రసాద్‌లతో కలిసి ఇందిరాపార్కు ధర్నాచౌక్, ఎన్టీఆర్ స్టేడియం, తదితర ప్రాంతాలను సందర్శించి అక్కడి పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీనివాస్ రెడ్డి, సాయికృష్ణ, శ్రీకాంత్ గౌడ్, డీఎస్ఐ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాభవన్ వద్ద ట్రాఫిక్ జామ్



ఖైరతాబాద్, డిసెంబర్ 15 : ప్రజా భవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్‌కు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. దీంతో పంజాగుట్ట నుంచి బేగంపేట వెళ్లే రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది.

## ఆస్తిపన్ను వసూళ్లపై డైలీ టార్గెట్స్

- డిసెంబర్ టార్గెట్ రూ.240 కోట్లు.. వసూలైంది కేవలం రూ.15 కోట్లు మాత్రమే
- ఆరు జోన్ల అధికారులపై కమిషనర్ అసహనం
- బకాయిదారులకు నోటీసులు, స్పందించకుంటే సీజ్
- స్పెషల్ డ్రైవ్ చేపడుతున్న జీహెచ్ఎంసీ
- గత సంప్రదాయానికి తెరదించడంతోనే మందగించిన వసూళ్లు..?




సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఆస్తిపన్ను వసూళ్లపై మరింత వేగం పెంచాలని కమిషనర్ రొనాల్డ్ రాస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. నిర్ధేశిత లక్ష్యాల అమలులో నిర్లక్ష్యం తగదని, వీక్లీ టార్గెట్స్ కాకుండా డైలీ టార్గెట్‌గా పెట్టుకుని ఆస్తిపన్ను వసూళ్లను రాబట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మూడు నెలల పాటు వసూళ్లలో వేగం మందగించిందన్నారు. దీంతో 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆరు జోన్ల పరిధిలో రూ.2100కోట్ల టార్గెట్‌లో దాదాపు రూ.1200 కోట్లకు పైగా వసూలు అయ్యాయి. ఆర్థిక సంవత్సరం ఈ నాలుగు నెలల పాటు రూ.900 కోట్ల మేర లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉండడంతో ఆస్తిపన్ను వసూళ్లపై ప్రధాన దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఆస్తిపన్ను వసూళ్లలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. ఈ నెలలోనే ఆరు జోన్లకుగానూ సుమారు రూ.240కోట్ల టార్గెట్ పెట్టుకుని రంగంలోకి దిగితే.. రెండు వారాలు గడిచినా ఇప్పటి వరకు రూ.15కోట్లు కూడా దాటలేకపోవడం పట్ల కమిషనర్ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. ముఖ్యంగా ఫైనాన్స్, రెవెన్యూ విభాగాలకు చెందిన అదనపు కమిషనర్లు, కమిషనర్లు కూడా ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్లపై విస్తృత తనిఖీలు చేపట్టేవారు. దీంతో పాటు ఎక్కువ ట్యాక్స్ కలెక్షన్ చేసే బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు ఇన్సెంటివ్స్ ఇచ్చే వారు. కానీ ఈ సంప్రదాయానికి తెరదించడంతోనే పన్ను వసూళ్లు సరిగా లేవన్న కారణాలుగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే బకాయిదారులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసులకు స్పందించకుంటే సంబంధిత షాపులను సీజ్ చేయడం లాంటి చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.